ట్రాఫిక్ టెన్షన్

- పరవాడ మండలంలో పెరిగిన వాహనాల రద్దీ
- ప్రధాన కూడళ్లలో నిత్యం ట్రాఫిక్ ఇక్కట్లు
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు, స్థానికులు



పారిశ్రామికాభివృద్ధిలో పరుగులు తీస్తున్న పరవాడ ప్రాంతంలో రోజురోజుకూ వాహనాల రద్దీ పెరుగుతోంది. దీంతో పలు ప్రధాన కూడళ్లు ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. మండలంలోని రాంకీ, మండల కాంప్లెక్స్, సబ్‌స్టేషన్, సినిమాహాలు, ఊటగెడ్డ కూడళ్లు ట్రాఫిక్ రద్దీతో పద్మవ్యూహాన్ని తలపిస్తున్నాయి. ఈ ప్రాంతాల్లోనే తరచూ ప్రమాదాలు, గంటల తరబడి ట్రాఫిక్‌జామ్‌లతో ప్రజలు తమ వాహనాలను బయటకు తీయాలంటే బెంబేలెత్తుతున్నారు.


ఊటగెడ్డ కూడలిలో అడ్డదిడ్డంగా పరుగులు తీస్తున్న వాహనాలు


వాహనాల రాకపోకలతో రద్దీగా మారిన సబ్‌స్టేషన్ కూడలి


కార్మికుల రాకపోకలతో రద్దీగా మారిన రాంకీ జంక్షన్


సినిమాహాలు కూడలిలో ఇష్టారాజ్యంగా వాహన రాకపోకలు

పరవాడ: పరిశ్రమలు ఎక్కువగా ఉన్న పరవాడ, గంట్యాడ, అచ్యుతాపురం ప్రాంతాల్లో షిఫ్టుల వారీ ఉద్యోగుల రాకపోకలు ఎక్కువ. సింహాద్రి ఎన్టీపీసీ, జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీ, ఇండస్ట్రియల్ పార్క్, హిందూజా, ఎస్‌ఈజెడ్ పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులతో ఇక్కడి ప్రధాన కూడళ్లు ఉదయం, సాయంత్రం సమయాల్లో విపరీతమైన రద్దీతో ఉంటాయి. వీటికితోడు విద్యార్థులు, సాధారణ ఉద్యోగులు, ప్రయాణికులు అదనం. దీంతో ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ ఇక్కట్లు సర్వసాధారణమయ్యాయి.

ఆ ప్రాంతాల నుంచే రాకపోకలు

ఎన్టీపీసీ, ఫార్మాసిటీ, ఇండస్ట్రియల్ పార్క్ పరిశ్రమల్లో ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు కలిపి సుమారు 36 వేల మంది పనిచేస్తున్నారు. వీరంతా విశాఖ, గాజువాక, అనకాపల్లి తదితర ప్రాంతాల నుంచి కార్లు, ద్విచక్ర వాహనాలపై లంకెలపాలెం, పరవాడ మీదుగా ఆయా పరిశ్రమలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఉదయం 8.30 నుంచి 10, సాయంత్రం 4 నుంచి 6 మధ్య పరిశ్రమలకు రాకపోకలు ఎక్కువ. మరోవైపు ఆయా పరిశ్రమలకు బొగ్గు, ఇతర మెటీరియల్‌ను సరఫరా చేసే భారీ వాహనాలు, సాధారణ ప్రయాణికుల కార్లు, ఇతర వాహనాలు కూడా ఈ కూడళ్ల మీదుగానే రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో ఈ రోడ్లు, కూడళ్లు పద్మవ్యూహాన్ని తలపిస్తున్నాయి.

విస్తరణకు నోచుకోక..

పరవాడ-యలమంచిలి రోడ్డు ఇరుకుగా ఉండడం, నిత్యం అధిక సంఖ్యలో భారీ వాహనాల రాకపోకలతో ద్విచక్ర వాహనదారులు ప్రయాణించేందుకే భయపడిపోతున్నారు. భారీ వాహనాలను తప్పించడం సాధ్యం కాక ఒక్కో రోజు నిర్ణీత సమయానికి విధులకు హాజరుకాలేకపోతున్నట్లు ఉద్యోగులు వాపోతున్నారు. భారీ వాహనాల రద్దీతో లంకెలపాలెం-యలమంచిలి రహదారిలోనూ తరచూ ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుని ప్రయాణికులు నరకం చూస్తున్నారు. ఈ రోడ్లను విస్తరించాలన్న ప్రతిపాదనలు ఏళ్లుగా కార్యరూపం దాల్చకపోవడంతో ప్రజల ఇబ్బందులు కొనసాగుతూనే ఉన్నాయి.

ట్రాఫిక్ నియంత్రణ చర్యలు శూన్యం

ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సమస్యల నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకోవడంలో ట్రాఫిక్ పోలీసుల వైఫల్యం కూడా ఈ ఇబ్బందులకు కారణమన్న ఆరోపణలున్నాయి. ప్రధాన రోడ్లపై ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్, కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ అమలుకాకపోవడంపై ప్రజలు ఆక్షేపిస్తున్నారు. ప్రధాన రోడ్లపై ట్రాఫిక్ ఎద్దడిని తప్పించుకునేందుకు బైక్‌లు, చిన్న చిన్న వాహనాలు ప్రత్యామ్నాయ మార్గాలుగా గ్రామీణ రోడ్లను ఆశ్రయిస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ప్రధాన కూడళ్ల వద్ద పోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేయడం ద్వారా కొంత మేర ట్రాఫిక్ ఇక్కట్లను, ప్రమాదాలను నియంత్రించవచ్చని స్థానికులు, ప్రయాణికులు చెప్తున్నారు.

వీటిని అధిగమించాలంటే..

- జనాభాలో 10 శాతం కూడా ప్రజా రవాణా వ్యవస్థను వినియోగించట్లేదని అధికారిక లెక్కలు చెప్తున్నాయి. దీన్ని కనీసం 50 శాతానికి చేరేలా ప్రోత్సహించాలి.
- వాహనాలు, పాదచారులు ప్రయాణించేందుకు వీలుగా రోడ్లపై ఆక్రమణలు తొలగించాలి.
- ఉదయం, సాయంత్రం వేళల్లోనే కాకుండా మిగిలిన సమయాల్లో కూడా ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచాలి.
- పాదచారులు నడిచేందుకు వీలుగా ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు తొలగించాలి.
- బస్, భారీ వాహనాల లేన్లకు ఆటంకాల్లేకుండా ప్రయాణం సాఫీగా జరిగేలా చర్యలు తీసుకోవాలి.

పోలీసు పికెట్ నిర్వహించాలి



ఉదయం, సాయంత్రం సమయాల్లో భారీ వాహనాలు, ద్విచక్ర వాహనాల రాకపోకలు, విధులకు వెళ్లే ఉద్యోగులు, కార్మికులతో రాంకీ, ఊటగెడ్డ, సబ్‌స్టేషన్ కూడళ్లలో రద్దీ ఎక్కువగా ఉంటుంది. రోజువారీ డ్యూటీలకు వెళ్లే క్రమంలో ట్రాఫిక్‌లోపడి ఆలస్యం అవకూడదని కార్మికులు అతివేగంగా ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. సమస్యను చక్కదిద్దడానికి పోలీసులు చర్యలు తీసుకోవాలి. నిత్యం రద్దీగా ఉండే జంక్షన్ల వద్ద పోలీస్ పికెట్ నిర్వహించాలి.

– చింతకాయల నాయుడు, కార్మికుడు

సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయాలి



కూడళ్ల వద్ద సిగ్నల్ లైట్ల ఏర్పాటు చేయడం ద్వారా ప్రమాదాలను కొంత మేర అరికట్టవచ్చు. ఇరుకుగా ఉన్న రోడ్లను విస్తరించి, ప్రధాన జంక్షన్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి. పరిశ్రమలకు రాకపోకలు సాగించే భారీ వాహనాల వల్ల తరచూ ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటికి నిర్దేశిత సమయాలు నిర్ణయించాలి. ప్రధాన కూడళ్ల వద్ద ఉదయం, సాయంత్రం రెండు గంటల పాటు ట్రాఫిక్ పోలీసులను నియమిస్తే కొంత మేర సమస్యలను అరికట్టవచ్చు.

– దొడ్డి పైడిరాజు, ఊటగెడ్డ కూడలి

చర్యలు తీసుకుంటాం



ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి త్వరలోనే పటిష్ట కార్యాచరణ రూపొందిస్తాం. తరచూ ట్రాఫిక్ సమస్యలు నెలకొంటున్న జంక్షన్ల వద్ద ట్రాఫిక్ పోలీసులను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం. వాహనాలపై రాకపోకలు సాగించే ఉద్యోగులు, కార్మికులు, సాధారణ ప్రజలు ట్రాఫిక్ నియమ నిబంధనలు ఖచ్చితంగా పాటించి, మా సిబ్బందికి సహకరించాలి. ఎక్కడికక్కడ తనిఖీలు చేపట్టి, ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– ఆర్.మల్లికార్జునరావు, సీఐ, పరవాడ

క్లుప్తంగా

గోదాదేవికి విశేష అలంకరణ



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన కొండదిగువ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా గురువారం విశేష పూజలు నిర్వహించారు. గోదాదేవి ఉత్సవమూర్తిని శోభాయమానంగా అలంకరించి ఆలయ ప్రాంగణంలోని వేదికపై కొలువుంచారు. తిరుప్పావైలోని నాలుగవ పాశుర విన్నపం చేసి, విశేష హారతులందించారు. భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని, గోదాదేవిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు భార్గవ్ తదితరులు పూజాకార్యక్రమాలను నిర్వహించారు.

ఘనంగా గోదాదేవి తిరువీధి


తిరువీధిలో ఆలయ సిబ్బంది

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా గురువారం గోదాదేవికి విశేషంగా తిరువీధి నిర్వహించారు. ఉదయం అమ్మవారి సన్నిధిలో పాశుర విన్నపం చేశారు. తర్వాత అమ్మవారి ఉత్సవ మూర్తిని పల్లకీలో అధిష్ఠింపజేసి ఆలయ బేడా మండపంలో తిరువీధి జరిపారు. విశేష హారతి అందించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అర్చకుడు రాజీవ్ తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

వేంకటాద్రిపై ప్రత్యేక పూజలు



పెందుర్తి: వేంకటాద్రిపై జరుగుతున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా నాలుగోరోజు గురువారం వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో వేకువజామున హారతి, సేవాకాలం, శాత్తుమురై, తిరుప్పావై పారాయణం, ప్రవచనం, తీర్థగోష్ఠి చేశారు. 4వ పాశురం వినిపించారు. అనంతరం ఈవో సీలిమ పర్యవేక్షణలో భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. ఉత్సవాలు ముగిసే వరకు భక్తుల కోసం కొండ దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం ఉంటుందని ఈవో వెల్లడించారు.

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు లాస్య


లాస్య

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థిని జాతీయ స్థాయి బాలికల ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఎస్.తిరుపతిరావు తెలిపారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కె.లాస్య స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన అండర్-17 ఖోఖో పోటీల్లో ప్రతిభ చూపి, రాష్ట్ర జట్టుకు ఎంపికైంది. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు అయోధ్యలో జరిగే జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో ఆడనుంది. ఈ సందర్భంగా లాస్యను ఉపాధ్యాయులు పి.రాధాకుమారి, అబ్దుల్ రెహమాన్, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ శంకరరావు అభినందించారు.

నృసింహ దీక్షాధారుల నగర సంకీర్తన


నగర సంకీర్తన చేస్తున్న సింహాద్రి మఠం శ్రీనృసింహ దీక్షాధారులు

సింహాచలం: సింహాద్రి మఠం ఆధ్వర్యంలో గురువారం ఉదయం శ్రీ నృసింహ దీక్షాధారులు అడవివరం గ్రామంలో నగర సంకీర్తన ఘనంగా నిర్వహించారు. కొండదిగువ శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామి తొలిపావంచా నుంచి దీక్షాధారులు స్వామివారి చిత్రపటాన్ని పట్టుకుని హరినామ సంకీర్తనలు ఆలపిస్తూ నగర సంకీర్తన చేశారు. గ్రామస్తులు స్వామిని దర్శించుకుని హారతులిచ్చారు. సింహాద్రిమఠం సభ్యులు కర్రి సీతారామ్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కోలుకుంటున్న డయేరియా రోగులు

- రోగుల్ని పరామర్శించిన డీఎంహెచ్‌వో బాలజీ


భర్నికంలోని వైద్య శిబిరంలో రోగిని పరామర్శిస్తున్న డీఎంహెచ్‌వో బాలాజీ

పరవాడ: భర్నికం గ్రామంలో డయేరియా సోకి వైద్య సేవలు పొందుతున్న రోగులను అనకాపల్లి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి(డీఎంహెచ్‌వో) ఎంఎస్‌వీకే బాలాజీ గురువారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. డయేరియా రోగుల కోసం గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని గురువారం సందర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామంలో పరిస్థితి నిలకడగా ఉందన్నారు. మంగళ, బుధవారాల్లో డయేరియా సోకిన 8 మంది రోగులు అనకాపల్లి ఎన్టీఆర్, పరవాడ పీహెచ్‌సీ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. వీరి ఆరోగ్య పరిస్థితి మెరుగుపడి, కోలుకుంటున్నారని పేర్కొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరికి ఆరోగ్య పరిస్థితి అడిగి వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించామన్నారు. వైద్య శిబిరం వారం రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. గ్రామంలో శానిటేషన్ నిర్వహణ, తాగునీటి సరఫరాపై ఆరా తీశారు. అనంతరం పరవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా అందుతున్న వైద్య సేవలను వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు.

దళితుల భూముల ఆక్రమణలపై ఫిర్యాదు


జుత్తాడ రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ ఆనంద్‌కుమార్, సర్పంచ్ చంద్రావతి

పెందుర్తి: జుత్తాడ పంచాయతీలో ఆక్రమణలకు గురైన దళితుల భూములను సంరక్షించాలని తహసీల్దార్ ఆనంద్‌కుమార్‌కు స్థానికులు కోరారు. గురువారం గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఈ మేరకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు. దీర్ఘకాలిక సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఈ సదస్సులను ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతుల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. వాటిని పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డు చంద్రావతి, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

వరి చేనులో నష్ట నివారణ చర్యలు


సబ్బవరంలో రైతులకు సూచనలిస్తున్న మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ

సబ్బవరం: తీవ్ర వాయుగుండం హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా వ్యవహరిస్తూ, వరి చేను ముంపునకు గురయ్యే పరిస్థితుల్లో నష్ట నివారణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ తెలిపారు. గురువారం ఆయన సబ్బవరంలో పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ కోసిన వరి పంటను చిన్నచిన్న కుప్పలుగా పెట్టుకోవడం వలన నీరు చేరే అవకాశం ఉండదన్నారు. కుప్పలపై టార్పాలిన్లు వేసుకుంటే మరీ మంచిదన్నారు. తడిసిన, నీరు చేరిన వరి పొలాల నుంచి ముందు నీటిని పూర్తిగా బయటకు పోయేలా ఏర్పాట్లు చేయాలన్నారు. తడిసిన వరి పనలు రంగు మారకుండా, మొలక రాకుండా ఉండేందుకు పనలపై గింజలు తడిసేలా లీటర్ నీటికి 5 గ్రాములు ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలని సూచించారు.

'అక్రమ కేసులు బనాయించడం అన్యాయం'

సింహాచలం: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆలయాల్లోని కేశఖండన శాలల్లో పనిచేస్తున్న నాయీబ్రాహ్మణులను పర్మినెంట్ చేస్తామని జేఏసీ నాయకులు లక్షల రూపాయలు వసూలు చేశారన్న ఆరోపణలపై నిజానిజాలు పరిశీలించకుండానే కేసులు పెట్టడాన్ని సింహాచలం దేవస్థానం కేశఖండనశాల ఉద్యోగుల సంఘం తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్షుడు జి. రాము గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. సింహాచలం కేశఖండనశాలలో పనిచేస్తున్న క్షురకులెవరూ ఒక్క రూపాయి కూడా లంచం ఇవ్వలేదని ఆయన స్పష్టం చేశారు. ఈ వివాదంపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అలాగే నిర్దోషులపై పెట్టిన క్రిమినల్ కేసులను వెంటనే ఎత్తివేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం కనీస వేతనం రూ.25 వేలు చెల్లిస్తామని హామీ ఇచ్చింది, ఈ హామీని నెరవేర్చే క్రమంలో కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తూ వివాదాలు సృష్టిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

నేడు గొరపల్లిలో రెవెన్యూ సదస్సు

పెందుర్తి: మండలంలోని గొరపల్లిలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఆనంద్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామ సచివాలయం వద్ద నిర్వహించే ఈ సదస్సుకు పంచాయతీ పరిధిలో భూములున్న రైతులంతా హాజరై తాము ఇబ్బంది పడుతున్న రెవెన్యూ పరమైన, ఇతరత్రా సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన అగత్యం లేకుండా ప్రజల వద్దకే అధికారులు వచ్చి, అర్జీలు తీసుకుని, వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు ఈ సదస్సులు దోహదపడతాయన్నారు.

మాజీ సీఎం జగన్ జన్మదిన వేడుకలు రేపు

సబ్బవరం: స్థానిక మూడు రోడ్లు కూడలిలో ఈ నెల 21న మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో భాగంగా పలు సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో మండలంలోని సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ ఎంపీటీసీలు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొనాల్సిందిగా పిలుపునిచ్చారు.

భగవంతుని ధ్యానంతో సుఖశాంతులు


నాయుడుపాలెంలో సీతారాముల విగ్రహాల పల్లకీ ఊరేగింపులో భక్తులు

పరవాడ: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాయుడుపాలెం, వాడచీపురుపల్లి, పరవాడ, వెన్నలపాలెం, లంకెలపాలెం గ్రామాల్లో ధనుర్మాసంలో నాలుగో రోజైన గురువారం నిర్వహించిన మేలుకొలుపులు ఆధ్యాత్మిక వాతావరణాన్ని చాటిచెప్పాయి. సీతారాముల విగ్రహాలను పురవీధుల్లో ఊరేగిస్తూ భగవంతుని నామాలు, సంకీర్తనలు చేసుకుంటూ గ్రామాల్లో తిరిగారు. దేవాలయాలు కేంద్రంగా భగవంతుని నామ సంకీర్తన జరిగే గ్రామాల ప్రజలు సుఖశాంతులతో ఉంటారని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. ప్రతి గ్రామంలో దేవాలయం కేంద్రంగా ధార్మిక జట్టు ఏర్పాటు చేసి, వారానికోసారి భజన, నెలలో రెండో శనివారం సత్సంగం కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. ఏకాదశికి నగర సంకీర్తన, ప్రతి పౌర్ణమికి సామూహిక హారతి కార్యక్రమం చేపట్టాలని కోరారు.

రైతుబజార్ ఈవో కొనసాగింపు


పద్మావతి షర్మిల

పెందుర్తి: స్థానిక రైతుబజార్ ఎస్టేట్ అధికారి(ఈవో)గా వి.పద్మావతి షర్మిల కొనసాగనున్నారు. గత రెండేళ్లుగా ఇక్కడ సేవలందిస్తున్న ఆమెను కొనసాగిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ రైతులకు, వినియోగదారులకు తగిన సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానని చెప్పారు.

విస్తం ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 23 మంది ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ శివకుమార్, సిబ్బంది

పెందుర్తి: మండలంలోని పినగాడి వెల్ఫేర్ ఇంజనీరింగ్(విస్తం) కళాశాలలో గురువారం నిర్వహించిన ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో ఏరీస్ సాఫ్ట్ టెక్ సొల్యూషన్స్ కంపెనీలో ఉద్యోగాలకు 23 మంది సీఎస్‌ఈ, ఈఈఈ, ఈసీఈ విద్యార్థులు ఎంపికయ్యారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వి.శివకుమార్, ఏరీస్ సాఫ్ట్ టెక్ సొల్యూషన్స్ కంపెనీ సీఈవో చైతన్య లహరి, ప్లేస్‌మెంట్ అధికారులు ఇ.కిరణ్‌కుమార్, ఎంవీజేటీ అరుణ్‌లు ఎంపికైన విద్యార్థులకు అభినందించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

తీరంలో తాబేలు కళేబరం


ముత్యాలమ్మపాలెం తీరానికి కొట్టుకొచ్చిన తాబేలు కళేబరం

పరవాడ: ముత్యాలమ్మపాలెం సముద్ర తీరానికి గురువారం ఓ తాబేలు కళేబరం కొట్టుకువచ్చింది. ఫార్మా వ్యర్థ రసాయన జలాలు సముద్ర జలాల్లో యథేచ్ఛగా విడిచిపెట్టడడంతో మత్స్య సంపదకు తీవ్ర నష్టం జరుగుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సముద్రంలో కలుస్తున్న రసాయన వ్యర్థాల వల్ల చాలాసార్లు చేపలు, తాబేళ్లు మృత్యువాత పడ్డాయని స్థానికుడు, బీజేపీ అనకాపల్లి జిల్లా కార్యదర్శి మోసా రామకృష్ణ ఆరోపించారు. దీనిపై కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం కనిపించలేదన్నారు. మత్స్య సంపదకు నష్టం వాటిల్లడం వల్ల చేపల వేట ప్రధాన వృత్తిగా జీవనం సాగిస్తున్న గంగపుత్రులు ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై సమగ్రంగా దర్యాప్తు జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

ద్రోణంరాజు సేవలు మరువలేనివి


చినముషిడివాడలోని ద్రోణంరాజు నివాసంలో నివాళులర్పిస్తున్న స్థానిక నాయకులు

పెందుర్తి: దివంగత రాజ్యసభ సభ్యుడు ద్రోణంరాజు సత్యనారాయణ 94వ జయంతి వేడుకలు గురువారం చినముషిడివాడలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పార్టీలకతీతంగా పెందుర్తి ప్రాంతాన్ని అభివృద్ధి చేసిన నాయకుడు ద్రోణంరాజు అని కొనియాడారు. ప్రజల్లో మంచి నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్న ఆయన లేని లోటును పూడ్చలేమన్నారు. రాజకీయాల్లో నేటి తరానికి ఆయన ఆదర్శప్రాయుడన్నారు. సమకాలీన రాజకీయాల్లో ద్రోణంరాజు వంటివారు అరుదుగా ఉంటారని పేర్కొన్నారు. గ్రామ నాయకులు ముమ్మన మహాలక్ష్మినాయుడు, రాపర్తి వాసు, ముమ్మన కనకరావు, కిలపర్తి చెల్లమ్మ, అక్కిరెడ్డి రామారావు, ముచ్చకర్ల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి ఛిద్రం



వేపగుంట-పినగాడి-సబ్బవరం ప్రధాన రహదారి పూర్తిగా ఛిద్రమైంది. ఇప్పటికే శిథిలావస్థకు చేరుకున్న ఈ రోడ్డు గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మరింతగా పాడైపోయింది. అడుగడుగునా భారీ గుంతలు ఏర్పడి, ఈ మార్గంలో ప్రయాణం నరకాన్ని తలపిస్తోందని వాహనదారులు వాపోతున్నారు. అధికారులు స్పందించి తాత్కాలికంగా అయినా రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

– పెందుర్తి